


# సర్పశిల

## - భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

**తక్షపురం**

ఊరు ఊరంతా గుసగుసలాడుకుంటున్నారు. ఆ వూరికొక ముసలామె వచ్చింది. వచ్చి సంవత్సరమయింది. రావడం రావడం ఆ సర్పశిలా మండపం దగ్గర కూర్చుంది. ఉలకదు - పలకదు. కూర్చున్నంతసేపు కూర్చోవడం.. ఆ తరవాత ఎప్పుడో కొండ చిలువ చుట్టచుట్టుకున్నట్టు పడుకోవడం. పడుకున్నాక ఏమ్మాత్రం కదలికలు కనిపించవు. ఆకలవుతుందో లేదో తెలీదు. ఎవరో, ధైర్యం చేసి తినడానికి ఏదన్నా అక్కడ పెడితే ఏ రాత్రో తింటుంది. తింటుందని అనుకుంటారు జనాలు. తినడం చూసినవాళ్ళు లేరు. ఆవిడంటే ఊరంతటికీ భయమే. కారణం కూడా తెలీదు.

ఎవడో పరాయి వూరినించి వచ్చినవాడు. ఆమెని పలకరించాడు. జనాలు చుట్టూ చేరారు, వాడికేమవుతుందో అని.

"మామ్మగారూ? మీరెవరూ? మీకేం కావాలీ?" అని అడిగాడు.

పడుకున్నదల్లా చివ్వున తాచుపాములాగా లేచింది. వాడ్ని చూసి పకపకా నవ్వింది. అది నవ్వా? వంద పగబట్టిన తాచులు ఒకేసారి బుస కొట్టినంత కఠోరంగా వుందా నవ్వు. భయమూ, వికారమూ ఒకేసారి కలిగించే నవ్వది.

"ఏం కావాలా? అడిగింది ఇస్తావా? ఇవ్వగలవా?" ఎగతాళిగా అన్నదా ముసలిది.

"అమ్మా పెద్దదానివి. తినడానికీ తాగడానికీ ఏర్పాటు చేద్దామని అడిగాను. ఆరునెలల క్రితం యీ వూరు నేనొచ్చినప్పుడు కూడా నువ్విలా పడివున్నావు" వినయంగానే అన్నాడతను.

"తినడమా? తాగటమా? అవే మీ సర్వనాశనానికి కారణం. పగలూ రాత్రి తిండి యావే. తిండికోసమే మీ బతుకులు. మీ బ్రతుకు చెడా, కడుపు నిండా తిని కంటినిండా నిద్రపోవడమే మీకు ఆనందం. ఎంత బుద్ధి లేనితనం. ఎంత క్షణికానందం. అసలు నువ్వెవరో, యీలోకంలోకి ఎందుకొచ్చావో తెలుసుకుందాం అనే ఆలోచన మీ మనసులో పుట్టనే పుట్టదు కదా. పుట్టడం, పెరగడం, ఎవత్తినో పెళ్ళిచేసుకోవడం, పిల్లల్ని కనడం, వాళ్ళ పిల్లల్ని ఎత్తుకుని ఏదో ఘనకార్యం చేసినట్టు జబ్బలు చరుచుకోవడం.. ఇదేగా మీ బ్రతుకూ?"కళ్ళు చిన్నవి చేసి పాము బుసకొట్టినట్టు అన్నదామె.

"అమ్మా ఆహార, భయ, నిద్రా మైధునాలు సర్వజీవలక్షణాలు. చీమనించి ఏనుగువరకూ పిచ్చుకనించి గండభేరుండాల వరకూ ఇవి సహజమేకదా. మనుషులు అసలు తినకుండా ఉండాలనా మీ ఉద్దేశ్యం. అమ్మా - దేవుళ్ళకే నైవేద్యాలు అవసరం అయినప్పుడు మనిషి తిండి లేకుండా ఎలా వుంటాడు?" కొంచెం కోపంగానే అన్నాడు ఆ పరాయివూరివాడు.

"ఎవడో తలకి మాసినవాడు చెప్పిన మాటల్ని విని, అవే నాకు ఏ కరువు పెడతావా సర్వజీవలక్షణాలుట. సర్వ జీవలక్షణాలు. పనిలేనివాళ్ళూ, పనికిమాలిన వాళ్ళూ చెప్పేమాటలివి. ఇంకొకాయనా అన్నాడుగా, 'కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు కదాచన' అనీ, కర్మ నీదా.. ఫలం మరొకడిదా? ఎవడికో ఫలం ఇవ్వడం కోసం నువ్వు పనిచెయ్యడం మూర్ఖత్వం కాదా? వేదాలుట.. ఉపనిషత్తులట. పురాణాలుట. పురుషార్థాలుట. ఓరిదేవుడో.. అవన్నీ క్షణక్షణానికీ కంకర గుట్టల్లా పెరుగుతూనే వున్నాయిగా. ఓరి మూర్ఖుడా ఒకడంటే ఒక్కడు.. నేను స్వర్గాన్నో నరకాన్నో చూశానని చెప్పాడా? రుజువులు చూపించడా. లేదే. అయినా సరే, అటువంటి వాళ్ళ మాటలు చెవుల్ని దొప్పలుగా చేసి మరీ వింటారు. ఛీ బ్రతుకంటే అదా?" అని ఛీత్కరించింది ఆ ముసలిది.

"అదిగాదమ్మా.. వేదోపనిషత్తులూ పురాణాలూ అన్నీ కల్పితమంటావా? దేవుడ్నే ధిక్కరిస్తావా?" కోపంగా అన్నాడా పరాయి వూరువాడు.

"హూ...! ఎవడ్రా అన్నదీ? మీ పుస్తకాలతో మీరు వూరేగండి. ప్రారబ్ధకర్మా సంచిత కర్మా అనుకుంటూ పిచ్చి పిచ్చి మాటల్తో పొద్దు పుచ్చండి. మనసుల్ని మత్తులో ముంచుకుని నిద్రించండి. నేనిక్కడున్నది నీతోటీ, నీలాంటి వాళ్ళతోటీ వ్యర్థంగా మాట్లాడటానికికాదు. ఫో...దూరంగా ఫో" ఎంత భీకరంగా అన్నదంటే, దూరాన్నించి చూస్తున్నవాళ్ళు కూడా ఒణికిపోయారు. మాట్లాడుతూ ఆ ముసలిది చేతులు ఎలా తిప్పిందంటే, అవే పడగవిప్పి ఆడుతున్న నాగుల్లా వున్నాయి.

ఆ పరాయివాడు బతుకు జీవుడా అని పారిపోయి ఇవతలి కొచ్చాడు. ముసల్ది యధాప్రకారం కొండ చిలువలా చుట్టచుట్టుకుని పడుకుంది.

బస్... క్షణాల్లో వాళ్ళిద్దరి సంభాషణ ఇంటింటికీ పాకింది.

"ఆవిడో మహా తపస్విని. అబ్బ.. ఎంత స్వచ్ఛ వేదాంతం, ఆ మాటల్లో" టపటపా లెంపలు వేసుకుని మహాభక్తిగా అన్నాడో పరమభక్తుడు.

"వీడు పెళ్ళాన్ని తన్నని రోజంటూ లేదు. పైకి మాత్రం మహాభక్తుడు" యీసడింపుగానూ గుసగుసగానూ పక్కవాడితో అన్నాడు మరొకడు. వాడిల్లు పరమ భక్తుడి ఇంటిపక్కనే.

"అయ్యా.. నా దృష్టిలో ఆవిడ ఒక కారణజన్మురాలు. ఓ ప్రత్యేకమైన దైవకార్యం మీద యీ భూమ్మీదకి వచ్చింది." డిక్లేర్ చేశాడో ఆచార్యులవారు. ఆయన 'ప్రవచనాలకి' పెట్టింది పేరు.

"కాదుటండీ మరీ. ఆ పడుకున్న పద్ధతి చూడండి. దాన్ని అజగరాసనం అంటారు" తన యోగాసనాల ప్రజ్ఞని బైటపెట్టాడో ఉత్సాహి.

"ఏమైనా నువ్వు చాలా అదృష్టవంతుడివోయ్. అంత కోపంగా మాట్లాడినా ఆవిడ నిన్ను 'శపించ'లేదంటే, అది నీవు పూర్వజన్మ సుకృతంకాక ఇంకేమిటీ?" ముక్కుపొడుం గాఢంగా పీల్చి అన్నాడో శాస్త్రిగారు.

"అంతశక్తి వుందంటారా?" శాస్త్రిగారితో అన్నాడో ఉత్సాహి.

"ఎందుకు లేదూ? ఇన్నాళ్ళపాటు ఆవిడ తిండీ తిప్పలూ లేకుండా వుందంటే, ఆ శక్తి యోగశక్తేకదా!" మరో నశ్యం పట్టుపట్టాడు శాస్త్రిగారు.

"ఎందుకు శపించాలీ?" కోపంగా అన్నాడో ఉత్సాహి.

"తపోభంగం చేస్తే మహా మునులు శపించరుటోయ్? అసలు వాళ్ళ నోట్లోనించి వచ్చే ప్రతిమాటా సత్యవాక్కే. ఏదంటే అది జరిగి తీరుతుంది" మరొకాయన శాస్త్రిగారి మాటని బలపరిచాడు.

అంతే! ఆవిడ శాపవశాత్తో, దైవకార్యనిమిత్తమో వచ్చిన దేవకన్య (?)నీ అతిత్వరలో తక్షేశ్వరపురం ఓ మహా సంఘటనకి కేంద్రబిందువు అవుతుందనీ రకరకాల వదంతులు పుట్టాయి.

మూడురోజుల్లో ఆ వదంతులకో స్వరూపం స్పష్టంగా ఏర్పడింది. అదేమిటంటే -

1. ఆ సర్పం శిలారూపాన్ని వదిలేసి 'నిజ'రూపం దాలుస్తుంది. మెరుపు వేగంతో పడగని తిప్పుతూ అగ్ని వర్షాన్ని కురిపిస్తుంది. ఆ క్షణాల్లోనే మిగతా నాలుగు సర్పాలు నోటిలోంచి అగ్నిజ్వాలలు కురిపించడం ప్రారంభిస్తాయి. ఆ జ్వాలల్లో ఎక్కడెక్కడి పాపులూ, దుర్మార్గులూ, దుష్టులు క్షణాల్లో భస్మమైపోతారు.

ఒకరు అమాయకంగా అడిగారు, "అయ్యా నేనూ కొన్ని చిన్న చిన్న పాపాలు చేశాను. పాపం చెయ్యని వాడంటూ లోకంలో వుండడుగదా. ఆ అగ్నిలో దగ్ధం కాకుండా వుండాలంటే నేనేం చెయ్యాలి?" అని. అడిగింది 'అన్నీ' తెలిసిన ప్రవచనకారుడ్ని.

"ఏం భయం అక్కర్లేదు. కాళహస్తి వెళ్ళి రాహు కేతు పూజలు చేయించు. అన్ని దోషాలూ నివృత్తమవుతాయి"

"ఆ పూజలవి సర్పదోషానికి కదా చేసేదీ?" సందేహంగా అన్నాడు అమాయకుడు.

"ఇదీ సర్పమేగా.!" చిద్విలాసంగా అన్నాడు ప్రవచనార్యుడు.

2. "అయ్యలారా, అన్నలారా, రాత్రి నేను తీవ్రాతి తీవ్రమైన యోగంలో కూర్చున్నాను. పదివేలసార్లు ఇష్టదేవతా మంత్రజపం చేశాక కొన్ని పలుకులు నా చెవులకి వినిపించాయి. అవి స్పష్టంగానూ, క్లుప్తంగానూ వున్నాయి. నాకు అర్థమైంది ఏమిటంటే, ఆ సర్పరూపంలో వున్నవాడో గాంధర్వుడు. ఆ మహా తాపస్విని అతని తల్లి. ఆవిడ వచ్చింది దేనికంటే, ఆ మహోగ్రమైన సర్పరూపాన్నించి కొడుకుని విడుదల చేయించడానికి. ఖచ్చితంగా తన తపశ్శక్తితో ఆవిడ కొడుక్కి ప్రాణం పోస్తుంది" ఆగాడు ఆ వూరి పూజారి. ఆ వూళ్ళో వున్నది ఒకే ఒక్క గుడి. ఆ గుడి ఆంజనేయస్వామిది. అది గుడి అంటేణ గుడేకాదు, గుహ అంటే గుహాకాదు. ఎవరు ఎప్పుడు ప్రతిష్టించారో తెలీదు, ఓ అడుగున్నర పొడుగుండే ఆంజనేయస్వామిని. ప్రస్తుతపు పూజారి తండ్రీ, తాతలనించీ వంశపారంపర్యంగా ఆ గుడికాని గుడికి పూజారయ్యాడు.

"ఆ తరువాత?" చాలా కుతూహలంగా అడిగారు చుట్టూ చేరినవాళ్ళు.

"ప్రాణం పోసుకోగానే ఆ గంధర్వుడు ఎవరైతే తనని శపించాడో వారిమీద క్రూరాతి క్రూరంగా పగదీర్చుకుంటాడు" వివరించాడు పూజారి.

"మరి చిన్న సర్పాలు?" ఒకడడిగాడు.

"అవి ఆ గంధర్వుడి పుత్రులు. అవీ నాలుగు దిక్కులూ వెతికి వెంటాడి మరీ పగతీర్చుకోవడంతో తండ్రికి సహాయం చేస్తాయి" మరింత వివరించాడు పూజారి.

"అప్పుడు వూరేమవుతుందీ?" భయంగా అడిగాడో పెద్దాయన.

"మనకేం భయం. గుహలో వుండే ఆంజనేయస్వామి శక్తి మీకే తెలుసు? తరతరాలనించీ పూజలు చేసేదీ మా వాళ్ళే కనుక నాకు తెలుసు. ప్రతి మంగళవారం ఆకు పూజ చేసి గారెలదండలు వేసి నావంటి సద్బ్రాహ్మణుడికి మీ స్థాయికి తగినంత తాంబూలంగా సమర్పిస్తే సకలశుభాలూ కలుగుతాయి. ఇహ ప్రతిశనివారం అయిదుశేర్ల బియ్యమూ

అయిదుశేర్ల కందిపప్పూ అయిదు వీశల నువ్వులనూనె సమర్పిస్తే, అంటే, స్వయంపాకంగా ఇస్తే శని, పీడా, శనిబాధా తొలుగుతుంది. ఆ బాధ్యత నాది'' ధీమాగా అన్నారు పూజారిగారు.

జనాలు రాక ఇంట్లో గడవటం కష్టంగా ఉంది. ఇలాంటి సమయంలోనేగదా కాస్త బుర్రవుపయోగించాల్సిందీ.

''నువ్వు చెప్పింది నిజమేనోయ్ అవధానీ, అలాగే, వారానికి రెండురోజులపాటు నలభై వారాలుగానీ, ప్రతిరోజూ రెండుగంటల చొప్పున నలబైరోజులుగా నీ భాగవత పఠనమూ, ప్రవచనమూ కానిస్తే ఊరు వూరంతా సుభిక్షంగా వుంటుంది. శ్రీకృష్ణులవారేకదా, నాడు కాళీయుడి పడగలమీద ఎక్కి వాడి గర్వాన్ని అణిచిందీ'' పూజారిని వెనకేసుకొస్తూ, తన బుర్రకీ పదును పెట్టాడు ప్రవచనాచార్యులు.

''ఊరి బాగుకోసం ఏదైనా సరే తక్షణం చెయ్యాల్సిందే పిడికిలి బిగించి అన్నాడు ఆ వూరి పంచాయితీ ప్రెసిడెంటు, అతని దృష్టిలో 'విరాళాల' లెక్కలు ఆల్‌రెడీ కదుల్తున్నాయి.

పెనమూరు దాటి చిత్తూరు వెళ్తుండగా భయంకరమైన ఈదురుగాలి మొదలైంది. రోడ్డుమీద ఏ మాత్రం ట్రాఫిక్ లేదు. కారు ఊగుతోంది'' పోనీ ఏ చెట్టు దగ్గరైనా ఆపితే'' అన్నాడు జయ్.

''వద్దు.. పొరబాటున చెట్టో, చెట్టు కొమ్మలో విరిగి కారుమీద పడితే?'' కంగారుగా అన్నాడు సుదర్శన్.

గాలి ఇంకా తీవ్రమైంది.

''ఏమిటీ యీదురుగాలి'' తనలో తను అనుకున్నారు శాస్త్రిగారు.

''సార్.. అటుచూడండి'' డ్రైవర్ అన్నాడు. మబ్బులు ... నల్లని మబ్బులు భీకరంగా కమ్ముకొస్తున్నాయి. ఎంత వేగంగా అంటే, ఒడ్డుని ముంచెయ్యడానికొస్తున్న రాక్షసి అలల్లాగా వస్తూన్నై.. దూరం నించి.

''మైగాడ్. కనీసం చిత్తూరైనా చేరితే బాగుండును'' కంగారుగా అన్నాడు జయ్. రాబీ ఒళ్ళు తెలీని నిద్రలో వుండటాన్ని శాస్త్రిగారు రియర్ వ్యూ మిర్రర్‌లో గమనించారు.

''నమ్మకం లేదు సార్. రోడ్డు బాగున్నా, యీ గాలికి వర్షంతోడైతే వేగంగా వెళ్ళడం అసంభవం'' బేలగా అన్నాడు డ్రైవర్.

మబ్బులు క్షణాల్లో కారుకి సుమారు 200 గజాల దాకా వచ్చాయి. గాలి మరీ ఎక్కువై కారుని ఆపి పడేస్తోంది. మబ్బులెంత దట్టంగా, కిందవరకూ వున్నాయంటే ఆల్‌మోస్ట్ రోడ్డుమీదకున్నట్టున్నాయి.

''సార్.. ఆ మబ్బులమధ్యకి పోతే దారి కనపడదు'' కంగారుగా డ్రైవర్ అంటూవుండగానే వడగళ్ళలాంటి చినుకులు కారుమీదా రోడ్డుమీదా టపటపా రాలిపడుతున్నై. అంత పెద్ద చినుకుల్ని ఏనాడూ ఎవరూ చూళ్ళేదు. అదేమాట కంగారుగా అన్నాడు సుదర్శన్. చినుకులు పెరిగి పెరిగి వర్షమయ్యాయి. కుండపోతలాంటి వర్షం.. దానికి తోడు భయంకరమైన గాలి. హెడ్‌లైట్లు వేసినా దారి కనపడటంలేదు. ఆగక తప్పదు. ఆగితే ఏమవుతుందోననే భయం. ఎవరో కట్లు తెగ్గోసినట్టు కారు పై భాగాన ప్లాస్టికొతాళ్ళతో కట్టిన లగేజ్ 'గుప్పు'న ఎగిరిపోయింది. అందరూ చూస్తుండగానే అది మబ్బులవల్ల కమ్మిన చీకట్లోకి మాయం అయింది. భయంతో బ్రేక్ తొక్కాడు డ్రైవర్.

స(రున కారు ఓ పక్కకి ఒరిగింది. రోడ్డు పక్కన వున్న మట్టి లూజ్‌గా వుండటంతో అది పక్కనున్న చిన్న లోయలోకి జారింది. మహా అయితే రోడ్డుకి ఆ లోయలోకి జారింది. మహా అయితే రోడ్డుకి ఆ లోయ ఓ అయిదారు గజాలు వుంటుందేమో. అదృష్టవశాత్తూ అక్కడ ఆగింది. కారు గనక రెండు మూడు పల్టీలు కొడితే జారేది భీకరమైన లోయలోకే.

అందరి గుండెలూ భయంకరంగా కొట్టుకుంటున్నాయి. కారు ఆగిందనీ లోయలోకి దొర్లిందనీ, దొర్లి మళ్ళీ నాలుగు చక్రాలమీదా నిలిచిందనీ తెలుసు. మరో అదృష్టం ఏమంటే కారు పక్కకి దొర్లడం వల్ల కారుమీద ఈదురుగాలి ప్రభావం పూర్తిగా తగ్గింది. "శ్రీనివాస్ పరిస్థితి ఏమిటో" కంగారు కలిసిన స్వరంతో అన్నారు శాస్త్రిగారు.

"మైగాడ్. నిజమే.. అతని గురించిన ఆలోచనే రాలేదు" కంగారుగా అన్నాడు జయ్.

"ఏమీ ప్రమాదం జరగకూడదనే కోరుకుందాం.." లోపల భయంగా వున్నా బైటకి ధైర్యం నటిస్తూ అన్నాడు సుదర్శన్.

"ఈ రాబీ చూడండి.. దెయ్యం పట్టినట్టు ఎలా నిద్రపోతున్నాడో" జయదేవ్ అన్నాడు శాస్త్రిగారితో.

"అదీ మంచిదే" నిర్లిప్తంగా అన్నారు శాస్త్రిగారు.

"సార్.. యీ భయంకరమైన వాతావరణానికీ, రాబీకీ, ఆ విలియమ్స్‌కీ ఏదైనా సంబంధం ఉందంటారా?" సందేహిస్తూనే అడిగాడు సుదర్శన్.

"ఉండొచ్చు.. ఉండకపోవచ్చు. ఒకటిమాత్రం నిజం. కొన్ని ఆత్మలు ప్రకృతి శక్తుల్ని ప్రేరేపించగలవు. ఇప్పుడు మనం చూసిన మేఘాలు సహజంగా ఉద్భవించిన మేఘాలు కావని నాకు చూసిన క్షణానే అనిపించింది. అలాగే యీ యీదురుగాలి" అన్నారు శాస్త్రిగారు.

"నేలని అంటుకున్నట్టు మేఘాలు రావడం నేనేనాడూ చూళ్ళేదు" షాక్‌తో అన్నాడు సుదర్శన్.

"అలా ఏమీకాదు. ఇదంతా కొండలూ గుట్టలూ అభయారణ్యాలూ వున్న ప్రదేశం. వర్షాకాలంలో కొండలమీద మేఘాలు ఆవరించడమూ, కూర్చున్నట్టుగా వుండటము మనం చూస్తూనే వున్నాంగా. ఒకటి మాత్రం నిజం. ఇది సహజమైన వర్షమూ యీదురుగాలీ అయితే పరవాలేదు. దీనివెనక ఏదైనా 'శక్తులు' ఉన్నా కూడా ప్రస్తుతానికి భయంలేదు. ఎందుకంటే, అవి మనల్ని హెచ్చరించడానికి వచ్చాయేమోగానీ, చంపడానికి రాలేదు. అందుకే కారు దొర్లి, పొర్లినా సురక్షితమైన చోటే ఉన్నాం" నిట్టూర్చి అన్నాడు శాస్త్రిగారు.

"ఈ కారుని ఎలా పైకి తియ్యాలో.. అసలు వస్తుందో రాదో" బాధగా అన్నాడు డ్రైవర్.

"ఆ విషయం నాకు వదిలెయ్ మీడియం క్రేన్స్ తెప్పిద్దాం, ముందు ఆలోచించాల్సింది కార్లో వుండాలా లేక.." మధ్యలో ఆపేశాడు జయ్.

ఎలా వచ్చిందో తెలీదుగానీ బోనెట్ మీదకి ఓ పాము ఎక్కింది. కనీసం ఏడెనిమిది అడుగులుంటుంది. చిన్న సైజు అరిటాకంత పడగ. రెండుమూడు నిమిషాలుండి క్రిందకి దిగిపోయింది. ఎవ్వరికీ నోటమాటరాలేదు.

అది సాయంత్రమో రాత్రో తెలియనంతగా చీకటి అలుముకుంది.

మెల్లగా ఆకలి మనసుల్ని లొంగదీసుకుంది. పైనుండీ లగేజ్ మొత్తం ఎగిరిపోయింది గనక పైన పాక్ చేసిన తినుబండారాలూ దుస్తులూ అవీ దొరికే ప్రసక్తేలేదు. శ్రీనివాస్ కార్లో కావాల్సినంత ఫుడ్ వుంది. వెతికేదెవరూ? తెచ్చేదెవరూ.!

వర్షం కురుస్తూనే వుంది. రాబీ నిద్రపోతూనే వున్నాడు. ఒక పక్క ఆకలి.. మరో పక్క నిద్రని దూరంగా నెట్టిన నీరసమూ, భయమూ...

Post your comments

*(కొనసాగింపు వచ్చే నెలలో)*